సాక్షి
అనంతపురం
సోమవారం । 11 । ఆగస్టు । 2025



ఇన్‌చార్జ్‌ల ఏలుబడి.. పట్టాలెక్కని ప్రగతి

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు మండలాల్లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓలతో పాలన సాగుతుండటంతో గ్రామీణాభివృద్ధి ముందుకు సాగడం లేదు. 8లో



టమాట కిలో రూ.40

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.40 పలికింది. కనిష్టం రూ.30, సరాసరి రూ.24 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.9°/21.4°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా తగ్గింది. ఆకాశం మేఘావృతమై మోస్తరుగా వర్షం పడింది. ఆగ్నేయం నుంచి పశ్చిమ దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'



అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు అర్జీతో పాటు ఫోన్, ఆధార్ నంబర్లు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. సమర్పించిన అర్జీల స్థితిని కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. సమస్యల పరిష్కారం కోసం అర్జీలను 'పరిష్కార వేదిక'లోనే కాకుండా meekosam.ap.gov.in వెబ్ సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని ఆయన తెలియజేశారు.

యాడికిలో భారీగా రేషన్ బియ్యం పట్టివేత



బలరాముడుకు చెందిన రైస్ మిల్లులో నిల్వ ఉంచిన బియ్యం బస్తాలు

యాడికి: ఓ రైస్ మిల్లులో భారీగా దాచిన రేషన్ బియ్యం బస్తాలను అధికారులు పట్టుకున్నారు. వివరాలు..యాడికి మండల కేంద్రానికి చెందిన బలరాముడు అలియాస్ బాలుకు యాడికి–పెద్దపేట గ్రామాల మధ్య రైస్ మిల్లు ఉంది. బలరాముడు కొంత కాలంగా ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి తన రైస్ మిల్లులో నిల్వ చేస్తున్నాడు. అనంతరం వాహనాల్లో ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఈ విషయాన్ని ఇటీవల కొందరు తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే ఏఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున సీఐ ఈరన్న తమ సిబ్బందితో కలిసి రైస్ మిల్లుపై దాడి చేశారు. అక్కడ నిలిపిన లారీ, బొలెరోలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి వాటిని యాడికి పోలీసుస్టేషన్‌కు తరలించారు. సీఎస్‌డీటీ మల్లేసు రాయలచెరువులోని వేబ్రిడ్జి కాటాలో తూకం వేయగా మొత్తం 337.5 క్వింటాళ్లు ఉన్నట్లు తేలింది. అయితే, బలరాముడు వద్ద ఇంకా రేషన్ బియ్యం ఉందని స్థానికుల ద్వారా సమాచారం అందడంతో సీఐ ఈరన్న, ఎస్ఐ రమణయ్య, సీఎస్‌డీటీ మల్లేసులు మరోసారి సాయంత్రం మిల్లును తనిఖీ చేశారు. ఈ క్రమంలోనే వారికి వందల సంఖ్యలో రేషన్ బియ్యం ప్యాకెట్లు కనిపించాయి. సీఎస్‌డీటీ వెంటనే రైస్ మిల్లును సీజ్ చేశారు. తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి అక్కడికి చేరుకుని అధికారులతో మాట్లాడారు. సోమవారం రైస్ మిల్లులోని రేషన్ బియ్యాన్ని గుంతకల్లులోని గోడౌన్‌కు తరలిస్తామని తెలిపారు. అంతవరకు రైస్ మిల్లు వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు.

జిల్లాకు చేరిన ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాకు 675 మెట్రిక్ టన్నుల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంవోపీ) సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక ప్రసన్నాయపల్లి రేక్‌పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన మహాధన్ కంపెనీకి చెందిన ఎంఓపీని ఆయన పరిశీలించి, మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు వీటిని సరఫరా చేయనున్నామని పేర్కొన్నారు.

చెరబట్టి.. కొల్లగొట్టి

కొండను పిండి చేసిన ఈ దృశ్యం అనంతపురం రూరల్ మండలం నరసనాయునికుంట సమీపంలోనిది. ఇక్కడి నుంచి ఓ 'పచ్చ' నేత నిత్యం ఎర్రమట్టిని తవ్వేసి టిప్పర్ల ద్వారా రవాణా చేస్తూ లక్షలాది రూపాయలు వెనకేసుకుంటున్నాడు. అనంతపురం నగరానికి చెందిన ఆయన ఇక్కడ 3 హెక్టార్లలో గ్రావెల్ క్వారీ లీజును తన సోదరి పేరిట తీసుకున్నారు. అయితే లీజు తీసుకున్న ప్రాంతంలో కాకుండా వేరే చోట నుంచి మట్టి తవ్వి అమ్ముకుంటున్నాడు. ఒక క్యూబిక్ మీటర్‌కు ప్రభుత్వానికి రూ. 200 ప్రకారం రాయల్టీ చెల్లించాల్సి ఉన్నా.. ఒక్క పైసా చెల్లించకుండానే కొన్ని లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని అక్రమంగా తవ్వేసి తరలించారు. ఇక్కడొక్కటే కాదు.. జిల్లావ్యాప్తంగా సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. అందిన కాడికి 'తెలుగు' తమ్ముళ్లు కొల్లగొడుతున్నా అటు వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు.



- జిల్లాలో ఎటు చూసినా సహజ వనరుల దోపిడీ
- ఇష్టారాజ్యంగా ఎర్రమట్టి తవ్వకాలు
- రేయింబవళ్లు భారీగా దందా
- రూ.కోట్లు గడిస్తున్న 'తెలుగు' తమ్ముళ్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

అనంతపురం టౌన్/రాప్తాడు రూరల్: కూటమి సర్కారు వచ్చినప్పటి నుంచి 'పచ్చ' నేతలు ఎర్రమట్టి, కంకర తదితర సహజ వనరులను అక్రమంగా తరలిస్తూ రూ.కోట్లు కొల్లకొడుతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజు నుంచే కొండ గుట్టలను చెరబట్టారు. ప్రతిరోజూ రూ. కోటికి పైగా అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తోంది.

అనంతపురం రూరల్‌లో దందా..

ఎర్రమట్టికి అనంతపురం నగరంలో మంచి డిమాండ్ ఉంది. టిప్పర్ మట్టి రూ.8 వేలకు పైగా పలుకుతోంది. ఈ క్రమంలో అనంతపురం రూరల్ మండలం ఆలమూరు, నరసనాయునికుంట, క్రిష్టం రెడ్డిపల్లి, చియ్యేడు గ్రామ శివారుల్లోని కొండ గుట్టల నుంచి పెద్ద ఎత్తున ఎర్రమట్టి తవ్వకాలు చేస్తున్నారు. రాయల్టీ, సీనరేజ్ చెల్లించకుండానే తవ్వకాలు చేపడుతూ రూ. కోట్లు కొల్లగొడుతున్నారు. దీంతో పాటు ఆత్మకూరు మండలంలోని వడ్డుపల్లి, పంపనూరు ప్రాంతాల నుంచి రోజూ ఎర్రమట్టిని తవ్వేసి తరలిస్తున్నారు. గతంలో టీడీపీ మండల కన్వీనర్‌గా పని చేసిన వ్యక్తితో పాటు మాజీ సర్పంచ్ నేతృత్వంలో పెద్ద ఎత్తున ఇక్కడ మట్టి రవాణా సాగుతోంది. వీరికి నియోజకవర్గ ప్రజాప్రతినిధి అండదండలుండడంతో గనుల శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు.

జీరో వ్యాపారం..

తాడిపత్రి నియోజకవర్గంలో సహజ వనరులైన క్వార్ట్జ్, డోలమైట్‌తో పాటు నల్లబండల (నాపరాయి) జీరో వ్యాపారాన్ని టీడీపీ నేతలు జోరుగా సాగిస్తున్నారు. మహారాష్ట్ర, చెన్నై, మంగళూరు తదితర ప్రాంతాలకు నాపరాయిని ఎలాంటి పన్నులు కట్టకుండానే తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



అనంతపురం రూరల్ మండలం ఆలమూరు వద్ద ఎర్రమట్టి తరలించడంతో కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు



కాలువ వద్ద మట్టి తవ్వుతున్న జేసీబీ

హంద్రీ–నీవా గట్లు.. తూట్లు

ఉరవకొండ: వజ్రకరూరు, ఉరవకొండ, బెళుగుప్ప మండలాల్లో మట్టి దొంగలు రెచ్చిపోతున్నారు.ఉరవకొండ మండలం చిన్నముస్టూరు, ఇంద్రావతి, మోపిడి గ్రామాల వద్ద హంద్రీ–నీవా ప్రధాన కాలువ మట్టిని రాత్రింబవళ్లు ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తూ లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారు. కాలువ గట్ల నుంచి మట్టిని భారీగా తవ్వి తరలిస్తుండడంతో ఇప్పటికే గట్లు బలహీన పడి కోతలకు గురవుతున్నాయి. పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతున్నా నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులు కనీసం ప్రశ్నించడం లేదు.



ఉరవకొండలో హంద్రీ-నీవా కాలువ గట్టు మట్టిని ట్రాక్టరులో తరలిస్తున్న దృశ్యం

టిప్పర్ రూ. 8 వేలు..

గుంతకల్లు: నియోజకవర్గంలో 'కూటమి' నాయకులు గద్దల్లా తయారై కొండలు, గుట్టలు, వాగులు, వంకల్లో ఉన్న మట్టిని యథేచ్ఛగా తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. గుంతకల్లు మండలంలోని మల్లేనిపల్లి, పాతకొత్తచెరువు, చెన్నప్పకొట్టాల, పామిడి సమీపంలోని కొండలు, దేవరపల్లి కొండల్లో ఇప్పటికే ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు జరిపారు. ఒక్కో టిప్పరుకు రూ.8 వేలు, ట్రాక్టరుకు రూ. 3 వేలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. 8 నుంచి 10 టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రోజుకు 30 నుంచి 40 ట్రిప్పులు తరలించినట్లు సమాచారం. ఈ లెక్కన రోజుకు దాదాపు రూ.2 లక్షల మేర 'తమ్ముళ్లు' వెనకేసుకున్నారు. ఈ విషయం అధికారులు, పోలీసులకు తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.గుంతకల్లు మండలంలోని మల్లేనిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో మట్టి టిప్పర్ల కారణంగా పంటలు దెబ్బ తింటున్నాయని స్థానిక రైతులు వాపోతున్నారు.



గుంతకల్లు మండలం మండేకుల కొట్టాల వద్ద కొండను పిండి చేసిన దృశ్యం

ఎమ్మెల్యే అనుచరుడి కనుసన్నల్లో..

రాయదుర్గం నియోజకవర్గంలోని రోడ్డు మెటల్ క్వారీలు మొత్తం టీడీపీకి చెందిన టీవీఎస్ రావు కనుసన్నల్లో నడుస్తున్నాయి. ఈయన స్థానిక ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరుడు. బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు గ్రామ శివారు ప్రాంతాల్లో 19 పైగా ఉన్న రోడ్డు మెటల్ క్వారీలు గడిచిన ఏడాది నుంచి లీజు పరిధి దాటి తవ్వకాలు చేస్తున్నా గనుల శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇక.. ఐరన్ ఓర్‌తో పాటు, గ్రానైట్ (బ్లాక్, కలర్)కు రాయదుర్గం నియోజకవర్గం పెట్టింది పేరు. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండానే అత్యంత విలువైన ఈ ఖనిజాలను కూడా అక్రమ మార్గంలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. డీ హీరేహాళ్ మండలంలోని మడేనహళ్లి వద్ద ఇటీవల ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరిపారు. ఈ విషయాన్ని కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకోవడంతో అధికారులు మేలుకొని ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.



డీ హీరేహాళ్ మండలంలోని మడేనహళ్లి వద్ద మట్టి తవ్విన ప్రాంతం

కొనసాగుతోన్న వర్షాలు





తాడిపత్రి మండలం బుగ్గ వద్ద తెగిపోయిన రోడ్డు, ఆవులతిప్పాయపల్లి వంకలో కొట్టుకుపోయిన జీపు

- తాడిపత్రిలో అత్యధికంగా 72.2 మి.మీ వర్షపాతం నమోదు

అనంతపురం అగ్రికల్చర్/తాడిపత్రిటౌన్: జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 16.2 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. తాడిపత్రిలో అత్యధికంగా 72.2 మి.మీ వర్షం కురిసింది. అలాగే, నార్పల 66.4 మి.మీ, పుట్లూరు 58.8, యల్లనూరు 56.8, శెట్టూరు 55.8, గుమ్మఘట్ట 28.2, కంబదూరు 19.4, రాయదుర్గం 17.4, కణేకల్లు, పెద్దపప్పూరు, రాప్తాడు 10.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ఆగస్టు సాధారణ వర్షపాతం 83.8 మి.మీ కాగా ఇప్పటికే 106.5 మి.మీ నమోదైంది. ఓవరాల్‌గా 146.7 మి.మీ గానూ ఈ సీజన్‌లో 28 శాతం అధికంగా 189.1 మి.మీ వర్షం కురిసింది. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

- భారీ వర్షాలకు తాడిపత్రి మండలంలో వంకలు పొంగిపొర్లాయి. బుగ్గ సమీపంలో నిర్మాణంలో ఉన్న 544డీ జాతీయ రహదారి వద్ద పాత రోడ్డు బ్రిడ్జ్ కొట్టుకుపోయింది. దీంతో తాడిపత్రి–నంద్యాల మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడాయి. ఈ క్రమంలోనే 544డీ వద్ద మట్టి రోడ్డుపై వెళ్లేందుకు ప్రయత్నించిన ఓ లారీ ఇరుక్కుపోయింది. ఆవులతిప్పాయ పల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంకను దాటేందుకు ప్రయత్నించిన జీపు కొట్టుకొని పోయింది. జీపు డ్రైవర్ కిందికి దూకి ప్రాణాలు రక్షించుకున్నాడు. ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయం వద్ద కొండ చరియలు విరిగి పడి భక్తుల వాహనాలు మట్టిలో కూరుకుపోయాయి. వర్షాలకు ఆలూరు కోన జలపాతం కొత్త శోభ సంతరించుకుంది.

బీటీపీకి పోటెత్తిన వరద

బ్రహ్మసముద్రం/గుమ్మఘట్ట: బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట మండలాల మధ్య ఉన్న భైరవాని తిప్ప ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 1,655 అడుగులు కాగా ఆదివారం మధ్యాహ్నానికి 1,648 అడుగులకు నీరు చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తం అవుతున్నారు. ప్రాజెక్టులోకి వరద భారీగా చేరుతుండటంతో బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట మండలాల ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బీటీపీలోకి ప్రవహిస్తున్న వరద నీరు

రోగుల ప్రాణాలంటే లెక్కేలేదు

- 'మెడిసిన్'లో బాధ్యతారాహిత్యం
- సేవల్లో నాణ్యత కరువు
- ప్రమాదకర కేసులనూ తేలిగ్గా తీసుకుంటున్న వైద్యులు

అనంతపురం మెడికల్: పర్యవేక్షకుల బాధ్యతా రాహిత్యంతో ప్రభుత్వ సర్వజనాస్పత్రి వైద్యులను నిర్లక్ష్యం ఆవహించింది. ఇటీవల ఆస్పత్రిలో జరిగిన దారుణ సంఘటనలు ఈ దుస్థితికి అద్దం పడుతున్నాయి. అమాయక ప్రజల ప్రాణాలు గాల్లో కలసి పోతున్నా కూటమి ప్రజాప్రతినిధులు పట్టనట్లే ఉండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అంతా ఇష్టారాజ్యం..

సర్వజనాస్పత్రిలోని మెడిసిన్ విభాగంలో 5 యూనిట్లు ఉన్నాయి. అందులో ప్రొఫెసర్, 5 మంది అసోసియేట్లు, 11 మంది అసిస్టెంట్లు, ఐదుగురు సీనియర్ రెసిడెంట్లు, పదుల సంఖ్యలో పీజీ విద్యార్థులు ఉన్నారు. ఐదు యూనిట్లలో కలిపి ప్రమాదకర కేసులు కేవలం 20 నుంచి 30 వరకు ఉంటాయి. ఆయా కేసులపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలి. వాస్తవంగా మెడిసిన్‌లో కొందరు వైద్యులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే ఉంటున్నారు. రోజూ మధ్యాహ్నం 2 నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు ఒకే అసిస్టెంట్ ప్రొఫెసర్ అందుబాటులో ఉంటున్నారు. వీరే ఎమర్జెన్సీ, అక్యూట్ మెడికల్ కేర్(ఏఎంసీ), ఐసీసీయూ, ఎంఎం, ఎఫ్ఎం యూనిట్లు చూసుకోవాలి. ఈ క్రమంలో రోగులకు సేవలు సరిగా అందడం లేదు. పదుల సంఖ్యలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు ఉన్న నేపథ్యంలో ప్రణాళికబద్ధంగా రోజూ ప్రతి యూనిట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండేలా చూడాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. 'మెడిసిన్'లో వైద్యుల నడుమ కోల్డ్ వార్ నడుస్తుండడంతో ఇష్టారాజ్యంగా విధులు చేపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.



వైద్యుల నిర్లక్ష్యం కారణంగా రెండు రోజుల క్రితం సర్వజనాస్పత్రి సిటీ స్కాన్ విభాగం వద్ద మృతి చెందిన కృష్ణమూర్తి ఆచారి

పరువు పోతోంది...

కొందరు వైద్యుల పనితీరుతో మెడిసిన్ విభాగం పరువు పోతోంది. పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఓపీకి ఆలస్యంగా రావడం.. మధ్యాహ్నం 12 గంటలైతే గుట్టుచప్పుడు కాకుండా పాతూరు ఐరన్ బ్రిడ్జ్, సాయినగర్ జీరో క్రాస్‌లో ఉన్న క్లినిక్‌లకు పరుగులు తీయడం చేస్తున్నారు. ఈ విషయాలపై కలెక్టర్ కాస్త దృష్టి సారిస్తే మెడిసిన్ విభాగంలో వైద్యుల నిర్లక్ష్యం బట్టబయలవుతుందని ఆస్పత్రి వర్గాలంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు మేలుకుని ప్రణాళిక బద్ధంగా అడుగులు వేస్తారో లేదో చూడాలి.

ఆగడాలకు అడ్డేదీ..?

- తాడిపత్రిలో నియంతలా మారిన టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రికి రాకుండా అడ్డంకులు
- మాట వినని అధికారులపై చిందులు
- జేసీ ప్రవర్తనను ఏవగించుకుంటున్న ప్రజలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఆయన అరాచక శక్తి అవతారమెత్తారు. నిత్యం వివాదాల్లో నిలుస్తూ ఇటు ప్రజలకు, అటు అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, జిల్లా స్థాయి అధికారులపై సైతం రెచ్చిపోతున్నారు. అయినా, ఆయనపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చూసి ప్రజలు విస్తుపోతున్నారు. తాడిపత్రిలో తాను చెప్పిందే వేదం.. చేసిందే చట్టం అన్న రీతిలో టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి వ్యవహరిస్తున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోంది. కూటమి సర్కారు ఏర్పడినప్పటి నుంచి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రికి రాకుండా ప్రభాకర్ రెడ్డి అడ్డుకుంటుండడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తారన్న సమాచారం అందగానే తన అనుచరులతో అడ్డుకుంటామని సామాజిక మాధ్యమాల్లో ప్రకటించడం.. పోలీసులను ఇరుకున పెట్టడం.. జేసీకి ఆనవాయితీగా మారింది. దీనికితోడు ఇటీవల ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేసి మరీ వేధింపులకు పాల్పడుతుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఈ విషయాల్లో తమకే చికాకు పుట్టేలా జేసీ ప్రవర్తిస్తున్నారని కొంత మంది టీడీపీ నాయకులే చర్చించుకోవడం గమనార్హం.

వ్యక్తిగత సమస్యకూ రంగుపులిమి..

తన వ్యక్తిగత సమస్యకు కూడా ప్రజా సమస్య రంగు పులమడం.. ఆ మాటున అధికారులపై జులుం ప్రదర్శించడం జేసీ అలవాటుగా మార్చుకున్నారు. అందులో భాగంగానే ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడుపై ఆయన నోరు పారేసుకున్నారు. మరో విషయంలో ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరిపైనా రెచ్చిపోయారు. గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన నాగలక్ష్మిపై కాగితాలు విసిరేస్తూ 'నువ్వు కలెక్టర్‌గా పనికి రావు' అంటూ రౌడీయిజం ప్రదర్శించారు. అడ్డుకోబోయిన గన్‌మెన్‌ను తోసిపడేశారు. ఇటీవల తాడిపత్రి నియోజకవర్గంలో పవర్ గ్రిడ్ టవర్ల ఏర్పాటును అడ్డుకొని ఆ కంపెనీ సిబ్బందిపై దాడికి పాల్పడడమే కాకుండా ఓ ఉద్యోగిని కిడ్నాప్ చేసి చితకబాదారు. ఈ ఘటనలు జిల్లాలోనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపాయి. అయినా, ఉన్నతాధికారులు నోరెళ్లబెట్టి చూస్తుండడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండడం చూసి జిల్లా ప్రజలు నివ్వెరపోతున్నారు.

జంకుతున్న ప్రజలు..

జేసీ ప్రభాకర్ రెడ్డి అప్పుడప్పుడు సినిమా స్టైల్‌లో ఓపెన్ టాప్ జీపులో కూర్చుని ముందు, వెనకా యువకులు ద్విచక్రవాహనాల్లో వస్తుండగా తాడిపత్రి ప్రధాన రహదారులపై చక్కర్లు కొడుతుంటారు. తానేదో ఆ ప్రాంత రాజు అన్నట్లుగా దర్పం ప్రదర్శిస్తుంటారు. దీంతో ఏదైనా సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకు కూడా ప్రజలు జంకుతున్నారు. సమస్యల నడుమ సావాసం చేస్తూ లోలోనే కుమిలిపోతున్నారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లనే బెదిరిస్తున్న వ్యక్తికి తామొక లెక్కా అంటూ నిట్టూరుస్తున్నారు.

'భాగస్వాముల'తోనూ రగడ

'కూటమి' పార్టీల నాయకులతోనూ జేసీ ప్రభాకర్ రెడ్డి రగడకు దిగుతుండడాన్ని ఆయా పార్టీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు.ఇటీవల బీజేపీకి చెందిన జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డితో ప్రభాకర్‌రెడ్డి అమీతుమీకి దిగడం, అనంతపురంలో బస్సు దగ్ధం విషయంలో బీజేపీ నాయకులను దుర్భాషలాడటం... ఆ క్రమంలో ఆ పార్టీకి చెందిన మంత్రి సత్యకుమార్ యాదవ్ జేసీకి కౌంటర్ ఇవ్వడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

క్లుప్తంగా

గోవులను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

రాప్తాడు: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి అక్రమంగా ఆవులను శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లకు తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. ఆదివారం ఉదయం రాప్తాడు పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి 407 వాహనంలో అక్రమంగా ఆవులను తరలిస్తున్నట్లుగా విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి విశ్వనాథరెడ్డి, భజరంగ్ దళ్ సభ్యుడు లోకేపల్లి విశ్వనాథరెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు ఆదివారం ఉదయం 11 గంటలకు రాప్తాడు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన 407 వాహనంలో ఏడు ఆవులను గుర్తించి ఆధీనంలోకి తీసుకున్నారు. ఆవులను తరలిస్తున్న షేక్ బాబ్జాన్, దేశ్‌ముఖ్ బాబ్జాన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో వారిపై కేసు నమోదు చేశారు. ఆధీనంలోని గోవులను కూడేరులోని గోశాలకు తరలించారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి



గంగమ్మ (ఫైల్)

కళ్యాణదుర్గం: మండలంలోని యర్రంపల్లికి చెందిన టమాట వ్యాపారి మనోహర్ భార్య గంగమ్మ (40) బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. గంగమ్మ వారం రోజుల క్రితం ద్విచక్రవాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్సని మిత్తం అనంతపురం, అక్కడి నుంచి బెంగళూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. గంగమ్మ మృతదేహాన్ని చూడగానే బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. 'మాకు మా అమ్మ కావాలంటూ ఇద్దరు చిన్నారులు రోదించడం అక్కడి వారిని కలిచివేసింది. గంగమ్మకు భర్త మనోహర్, ఇద్దరు కుమారులు ఉన్నారు. గంగమ్మ స్వగ్రామం శెట్టూరు మండలం కనుకూరు కాగా, యర్రంపల్లికి చెందిన మనోహర్‌తో వివాహం జరిగింది.

విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

గోరంట్ల: స్థానిక బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో నివాసముంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు గాండ్ల వెంకటచలపతి ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు.. రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి కర్ణాటకలోని పుణ్యక్షేత్రాల సందర్శనకు వెంకట చలపతి వెళ్లారు. పసిగట్టిన దొంగలు శనివారం రాత్రి తాళాలను బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. ఆదివారం ఉదయం విషయాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న వెంకటచలపతి కుటుంబసభ్యులు గోరంట్లకు చేరుకుని పరిశీలించారు. బీరువాలోని రూ.10 లక్షల నగదు, 16 తులాల బంగారు నగలు అపహరణకు గురైనట్లు నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇన్‌చార్జ్‌ల ఏలుబడి.. పట్టాలెక్కని ప్రగతి



అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయం

కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాదికి పైగా అవుతోంది. అయినా పల్లె పాలన గాడిలో పడలేదు. గ్రామీణాభివృద్ధిలో కీలకమైన మండల పరిషత్ అభివృద్ధి అధికారుల(ఎంపీడీఓ)ను పూర్తి స్థాయిలో నియమించకపోవడంతో ప్రగతి కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు లేక.. ఇన్‌చార్జ్‌లతో నెట్టుకువస్తున్నారు. ఆయా మండలాల్లో అభివృద్ధి కంటే అవినీతి, అక్రమాలు, అవకతవకలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

- కూటమి పాలనలో కనిపించని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి
- తొమ్మిది మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు కరువు
- నియోజకవర్గ ప్రజాప్రతినిధి సిఫారసు ఉంటేనే బాధ్యతల నిర్వర్తింపు
- లేకపోతే చుక్కలు చూపిస్తున్న పాలకులు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 63 మండలాలు ఉన్నాయి. గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర ఎంపీడీఓలదే. అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ పోస్టుల్లో రెగ్యులర్ అధికారులు ఉంటేనే న్యాయం చేకూరుతుంది. అయితే ఇందుకు విరుద్ధంగా తొమ్మిది మండలాలకు ఇన్‌చార్జ్‌లతో కాలం నెట్టుకొస్తున్నారు. ఫలితంగా ఆయా మండలాల్లో అభివృద్ధి కుంటుపడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇన్‌చార్జ్‌ల ఏలుబడిలోని మండలాలు ఇవే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు లేరు. అందులో అనంతపురం జిల్లా కుందుర్పి, బ్రహ్మసముద్రం, గుంతకల్లు మండలాలు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో అగళి, చిలమత్తూరు, ముదిగుబ్బ, కనగానపల్లి, రొద్దం, తనకల్లు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల బాధ్యతలను పరిపాలనాధికారులు(ఏఓ), డిప్యూటీ ఎంపీడీఓలకు అప్పగించారు. ఈ మండలాల్లో ఏళ్ల తరబడి ఇన్‌చార్జ్‌లే కొనసాగుతుండడం గమనార్హం. కొత్త వారిని నియమించినా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అక్కడికి ఎవరూ వెళ్లడం లేదని తెలుస్తోంది. ఆ ప్రాంత నియోజకవర్గ ప్రజాప్రతినిధులను కాదని కొత్తవారిని నియమిస్తే వారు సజావుగా విధులు నిర్వర్తించలేని పరిస్థితులు కల్పిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

విపరీతమైన రాజకీయ జోక్యం..

ఎంపీడీఓల నియామకంలో రాజకీయ జోక్యం విపరీతంగా ఉందనేది బహిరంగ రహస్యం. గతంలో పదోన్నతిపై 15 మంది ఎంపీడీఓలు జిల్లాకు వచ్చారు. వీరికి మండలాలు కేటాయించగా కర్ణాటక సరిహద్దులో ఉన్న రెండు మండలాలకు ఎంపీడీఓలు నియమితులయ్యారు. అయితే అప్పటికే అక్కడ పాతుకుపోయిన ఇన్‌చార్జ్ ఎంపీడీఓలు ఆ ప్రాంత ప్రజాప్రతినిధుల ద్వారా జిల్లా పరిషత్ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకెళ్లి అడ్డుకున్నట్లుగా సమాచారం. కనీసం వారు జాయిన్ కూడా కానివ్వకుండా వచ్చిన వారిని వచ్చినట్లు వెనక్కి తిప్పిపంపడం విశేషం. ఈ వ్యవహారం చాలా రోజులు నడిచింది. చివరకు ఓ నియోజకవర్గ ప్రజాప్రతినిధి జెడ్పీ అధికారులపై చిందులు తొక్కి.. సీఈఓనే టార్గెట్ చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది.

త్వరలో నియమిస్తాం



సీనియారిటీ జాబితా ఇప్పటికే ప్రభుత్వానికి పంపాం. త్వరలో రెగ్యులర్ ఎంపీడీఓలుగా చాలా మందికి పదోన్నతి కల్పించనున్నాం. వారం, పది రోజుల్లో ఖాళీ మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలను నియమిస్తాం. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా, అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తాం. – శివశంకర్, జెడ్పీ సీఈఓ

మెరిట్‌కా? సిఫారసులకా?!



- నేడు, రేపు 'సమగ్ర' సెక్టోరియల్ పోస్టుల ఇంటర్వ్యూలు
- కీలకం కానున్న ఇంటర్వ్యూ మార్కులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఏడాదికి పైగా ఖాళీగా ఉన్న సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారుల పోస్టుల భర్తీ ప్రక్రియ గుట్టుగా సాగుతోంది. ఖాళీగా ఉన్న ఆరు సెక్టోరియల్ ఆఫీసర్ల పోస్టుల భర్తీలో భాగంగా రెండో సారి ఈ ఏడాది జూన్ 24న నోటిఫికేషన్ జారీ చేశారు. అదే నెల 30వ తేదీకి గడువు విధించారు. మొత్తం 172 దరఖాస్తులు అందాయి. వచ్చిన దరఖాస్తులన్నీ సమగ్రశిక్ష కార్యాలయంలోనే మూలుగుతున్నాయి తప్ప కనీసం స్క్రూటినీ కూడా చేయలేదు. ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న ఒత్తిళ్ల కారణంగానే అధికారులు ఎటూ తేల్చుకోలేక పోయారనే ఆరోపణలున్నాయి. పత్రికల్లో వరుస కథనాలు రావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. ఈ క్రమంలో గత నెలలో గుట్టు చప్పుడు కాకుండా దరఖాస్తులు స్క్రూటినీ చేశారు. అవి కూడా సమగ్రశిక్ష కార్యాలయంలో కాకుండా కలెక్టరేట్‌లో ట్రైనీ కలెక్టర్ సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగడం గమనార్హం.

అంతులేని రహస్యం..

దరఖాస్తులు స్క్రూటినీ చేసి ఒక్కొక్కరికీ వచ్చిన మార్కులు నమోదు చేసిన అధికారులు అవి బయటపడకుండా అత్యంత రహస్యంగా ఉంచారు. ముందుగా ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులతో పాటు వారికి వచ్చిన మార్కులను అధికారిక వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తామని చెప్పినా... తర్వాత ఏమి జరిగిందో ఏమోకానీ పేర్లు తప్ప మార్కులు ప్రదర్శించలేదు. మార్కులను బహిర్గతంచేయలేదు. తమకు దక్కిన మార్కులు తెలుసుకునేందుకు అభ్యర్థులు రకరకాల ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. దరఖాస్తుల స్క్రూటినీలో పాల్గొన్న ఎంఈఓలు, హెచ్‌ఎంలు ఎక్కడా నోరు జారగకుండా జాగ్రత్త పడి చివరకు 47 మందిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. వీరందరికీ సోమవారం (నేడు) కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయంటూ మూడు రోజుల క్రితం సమగ్రశిక్ష ఉద్యోగులు స్వయంగా ఫోన్లు చేసి సమాచారం అందించారు. అయితే ఏమి జరిగిందో ఏమోకాని సోమవారం 25 మందికి, మంగళవారం 22 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించేలా ఆదివారం మార్పు చేశారు. ఈ మేరకు అభ్యర్థులకు సమాచారం అందింది. అధికారిక వెబ్‌సైట్‌లోనూ ఉంచారు.

ఆ మార్కులే కీలకం..

ఇదిలా ఉండగా అధికార పార్టీ నేతల నుంచి తీవ్ర ఒత్తిళ్లు వస్తున్న నేపథ్యంలో ఇంటర్వ్యూకు కేటాయించిన 15 మార్కులు కీలకంగా మారనున్నాయి. కాగా, ఇప్పటి వరకూ చేసిన స్క్రూటినీలో అత్యధిక మార్కులు 54 వచ్చినట్లు తెలిసింది. ఈ మార్కులకు రెండో నంబరులోని అభ్యర్థికి వచ్చిన మార్కుల మధ్య బాగా తేడా ఉన్నట్లు సమాచారం. ఈ లెక్కన మిగిలిన వారికి 50లోపే మార్కులు వచ్చి ఉంటాయని తెలిసింది. ఈ పరిస్థితుల్లో ఇంటర్వ్యూ మార్కులపైనే ఆధారపడి ఉంటుంది. ఏది ఏమైనా మెరిట్‌కు పట్టం కడతారా? ప్రజాప్రతినిధుల సిఫారసులకు తలొగ్గుతారా? అనేది వేచి చూడాలి.

నిండా ముంచిన ఖరీఫ్

- కంది మినహా బాగా తగ్గిన వేరుశనగ, పత్తి, ఆముదం పంటల విస్తీర్ణం
- 3.42 లక్షల హెక్టార్లకు గానూ 1.70 లక్షల హెక్టార్లలో పంటలు
- ప్రత్యామ్నాయంపై దృష్టి సారించని కూటమి సర్కారు



అనంతపురం అగ్రికల్చర్: గత రెండు నెలలు (జూన్, జూలై) వర్షాభావం.. ఈ నెల అధిక వర్షాలు వెరసి ఖరీఫ్ కకావికలమైంది. విత్తుకునేందుకు కీలకమైన జూలైలో సాధారణం కన్నా 46 శాతం తక్కువగా వర్షాలు కురవడంతో ఏరువాకకు అంతరాయం ఏర్పడింది. దీంతో కంది పంట మినహా మిగిలిన పంటల విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. ప్రధానపంటలైన వేరుశనగ, పత్తి, ఆముదం సగానికి సగం కూడా సాగులోకి రాలేదు. వ్యవసాయశాఖ తాజా నివేదిక ప్రకారం చూస్తే... ఖరీఫ్‌లో 3,42,232 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం అంచనా వేయగా... ప్రస్తుతానికి 50 శాతంతో 1.70 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చాయి. ఇంకా 50 శాతం విస్తీర్ణంలో విత్తు లేక పొలాలు బీళ్లుగా ఉన్నట్లు చూపించారు. ఖరీఫ్‌లో ప్రధాన పంటలు విత్తుకునేందుకు గడువు ముగిసేనాటికి అంటే ఈ నెల 5వ తేదీ నాటికి 131.1 మి.మీ గానూ 37 శాతం తక్కువగా 82.7 మి.మీ వర్షపాతం నమోదైంది. అయితే గత నాలుగైదు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ఇప్పుడు సాధారణ కన్నా 28 శాతం అధికంగా వర్షం కురవడం విశేషం.

పెరిగిన కంది విస్తీర్ణం..

ఊహించినట్లుగానే ఈ సారి కూడా కంది పంటపై రైతులు మక్కువ చూపారు. ఈ ఏడాది 55,296 హెక్టార్లు అంచనా వేయగా... ప్రస్తుతానికి 120 శాతంతో 67 వేల హెక్టార్లలో కంది వేశారు. అలాగే సజ్జ కూడా 2,054 హెక్టార్లు అంచనా వేయగా... 125 శాతంతో 2,600 హెక్టార్లలో సాగు చేశారు. మొక్కజొన్న 14,653 హెక్టార్లకు గానూ 85 శాతంతో 12,400 హెక్టార్లలో వేశారు. ఈ మూడు పంటల విస్తీర్ణం పరిస్థితి మెరుగ్గానే కనిపిస్తోంది. అయితే ప్రధానపంటగా భావిస్తున్న వేరుశనగ 1.82 లక్షల హెక్టార్లు అంచనా వేయగా 32 శాతంతో 58,300 హెక్టార్లకు పరిమితమైంది. అలాగే పత్తి కూడా 44 వేల హెక్టార్లు అంచనా వేయగా 33 శాతంతో 14,600 హెక్టార్ల వద్ద ఆగిపోయింది. మరో ప్రధాన పంట ఆముదం కూడా 16,293 హెక్టార్లకు గానూ 47 శాతంతో 7,700 హెక్టార్ల వద్ద నిలబడిపోయింది. జొన్న, రాగి, కొర్ర, అలసంద, పెసర, మినుము, పొద్దుతిరుగుడు, సోయాబీన్ తదితర పంటలు నామమాత్రంగా సాగులోకి వచ్చాయి. పంటల విస్తీర్ణంపై మరింత స్పష్టత రావాలంటే ఈ–క్రాప్ తుది నివేదికలు అందాలని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయం చూపని సర్కారు..

ప్రధాన పంటల సాగుకు గడువు ముగియడంతో ఇంకా మిగిలి ఉన్న 50 శాతం విస్తీర్ణంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అయితే ఆ దిశగా కూటమి సర్కారు ఇంకా దృష్టి సారించలేదు. వ్యవసాయశాఖ కూడా ప్రభుత్వానికి ప్రత్యామ్నాయ ప్రణాళిక ఇంకా పంపకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం లక్ష హెక్టార్లకు అయినా ఉలవ, అలసంద, పెసర, మినుము లాంటి విత్తనాలు ఉచితంగా లేదా 80 శాతం రాయితీతో ఇచ్చి ప్రత్యామ్నాయం చూపాల్సిన ప్రభుత్వం ఇప్పటి వరకూ విత్తన ప్రణాళిక తయారు చేయకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలాల నుంచి పంటల విస్తీర్ణం వివరాలు అందుబాటులోకి వచ్చినా ప్రత్యామ్నాయం ఏమిటనే దానిపై నోరుమెదకపోవడంపై రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యామ్నాయం ఉంటుందా? లేదా అనేది కూడా అటు కూటమి సర్కారు ఇటు వ్యవసాయశాఖ స్పష్టత ఇవ్వడం లేదు.

ముగిసిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు



ప్రతిభావంతులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

పామిడి: రెండు రోజులుగా పామిడి వేదికగా సాగుతున్న ఏపీ విద్యాభారతి జోనల్ స్థాయి క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. ఉమ్మడి అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల నుంచి 350 మంది బాలురు, 250 మంది బాలికలు హాజరయ్యారు. అండర్–13, 15 విభాగాలల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ రేస్, లాంగ్‌జంప్, హైజంప్, యోగా, చదరంగం వంటి క్రీడా పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి మెడల్స్‌తో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కాగా, పోటీల ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఉమ్మడి అనంతపురం జిల్లా క్రీడాకారులు దక్కించుకున్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా పారిశ్రామికవేత్త రాంప్రసాద్, ప్రముఖులు రాఘవయ్య, సునీల్‌కుమార్, చౌడయ్య, హెచ్‌ఎంలు శ్రీనివాసన్, మయూరి, ఆచార్య బృందం పాల్గొన్నారు.

'ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికల్లో పారదర్శకత పాటించాలి'

కుందుర్పి: ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానానికి సంబంధించి అర్హుల ఎంపికలో పారదర్శకత పాటించాలని ఏపీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయభాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం కుందుర్పిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్తమ అవార్డుల ఎంపిక కోసం ఉపాధ్యాయులే దరఖాస్తులు చేసుకోవాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని అసోసియేషన్ వ్యతిరేకిస్తోందన్నారు. కాగా, ఎంతో మంది నిబద్ధతతో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమకు అవార్డులు ఇవ్వాలంటూ దరఖాస్తు చేసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో మార్పు చేయాలని కోరారు. రాజకీయ ప్రాబల్యమున్న వారికే అవార్డులు ఇస్తారనే భావన ఇప్పటికే చాలా మందిలో పాతుకపోయిందన్నారు. అలా కాకుండా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీలు నియమించి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టి నీతి, నిబద్ధతతో పనిచేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి, అవార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు.

అలరించిన సంగీత కచేరీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న బాలవికాస్ చిన్నారులు

ప్రశాంతి నిలయం: సత్యసాయిని కీర్తిస్తూ బాలవికాస్ చిన్నారులు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది. పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి విచ్చేసిన తెలంగాణ సత్యసాయి భక్తులు ఆదివారం సాయికుల్వంత్ సభా మందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ బాలవికాస్ చిన్నారులు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను మంత్రముగ్ధులను చేసింది.

యువకుడి దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతుడు మహేంద్ర

గోరంట్ల: ట్యాంకర్‌ను ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ యువకుడు దుర్మరణం పాలు కాగా, మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. గోరంట్ల మండలం బూదిలివాండ్లపల్లి గ్రామానికి చెందిన మహేంద్ర (26), శ్రీనివాసులు, కార్తీక్ ఆదివారం వ్యక్తిగత పనిపై గోరంట్లకు వచ్చారు. పని ముగించుకుని ఒకే ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు రెడ్డిచెరువుకట్ట సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా ప్రధాన రహదారిపై వస్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్నారు. ఘటనలో మహేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాసులు, కార్తీక్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురంలోని జిల్లాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై చిన్నాన్న దాడి

ధర్మవరం అర్బన్: స్థానిక గుట్టకిందపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రఘునాథరెడ్డిపై అతని చిన్నాన్న పుల్లారెడ్డి పారతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఆదివారం రఘునాథరెడ్డి ఇంటి వద్ద ఉన్న పశువుల కొట్టంలోని నిల్వ ఉన్న వర్షపు నీరు ఆ పక్కనే ఉన్న చిన్నాన్న పశువుల కొట్టంలోకి వెళుతున్నాయి. ఈ విషయంగా రఘునాథ్‌రెడ్డి తల్లి పద్మావతితో పుల్లారెడ్డి వాగ్వాదానికి దిగాడు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న రఘునాథరెడ్డి.. చిన్న విషయాలకు గొడవలు ఎందుకని తల్లి పద్మావతిని ఇంట్లోకి పిలుచుకెళుతుండగా పుల్లారెడ్డి దుర్భాషలాడుతూ పారతో రఘునాథరెడ్డిపై దాడి చేశాడు. తలకు తీవ్ర గాయమైన రఘునాథరెడ్డిని కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపారు.

79 అడుగుల త్రివర్ణ పతాకం ప్రదర్శన



ర్యాలీలో పాల్గొన్న సెంట్రల్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కోరి, విద్యార్థులు

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ (సీయూఏపీ) ఆధ్వర్యంలో 79 అడుగుల పొడవైన త్రివర్ణ పతాకాన్ని ఆదివారం అనంతపురంలో ప్రదర్శించారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం కింద చేపట్టిన ఈ ర్యాలీని క్లాక్‌టవర్ వద్ద సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి ప్రారంభించి, మాట్లాడారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 79 అడుగుల పొడవైన త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

గుత్తి: స్థానిక జీఆర్‌పీ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో రైలు కిందపడి ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి జీఆర్‌పీ పరిధిలోని ఓబులాపురం రైల్వే బ్రిడ్జి వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో జీఆర్‌పీ కానిస్టేబుల్ వాసు ఆదివారం అక్కడకు చేరుకుని పరిశీలించారు. శనివారం అర్ధరాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవడంతో శరీరం మూడు ముక్కలైంది. దీంతో గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య కింద తొలుత కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు విచారణలో మృతుడిని గుంతకల్లు మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ (32)గా గుర్తించారు. అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారణ అయింది. మరో ఘటనలో పెద్ద వడుగూరుకు చెందిన సురేష్ (28) 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఆదివారం పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, సురేష్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ రెండు ఘటనలపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం

పరిగి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పరిగి మండలం మోదా గ్రామానికి చెందిన సనావుల్లా కుమారుడు సయ్యద్ ముబారక్ (18) మెకానిక్ పని నేర్చుకుంటూ కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుంటే కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా ఫలితం లేకపోయింది. ఆదివారం నొప్పి తీవ్రత తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఇరు గ్రామాల రైతుల పరస్పర దాడి



అనంతపురంలో చికిత్స పొందుతున్న కొండారెడ్డి, గాయపడిన ఆదిశేఖర్‌రెడ్డి, లక్ష్మీదేవి

- రస్తా విషయంగా గొడవ
- ఒకరి పరిస్థితి విషమం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

తాడిపత్రి టౌన్: పొలాలకు వెళ్లే రస్తా విషయంగా ఇరు గ్రామాల రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని పరస్పర దాడులకు దారి తీసింది. బాధితులు తెలిపిన మేరకు.. తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన కొందరు రైతుల పొలాలు జోగినాయునిపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్నాయి. ఆ పొలాలకు వెళ్లేందుకు బ్రాహ్మణపల్లి రైతులకు కేవలం కాలి నడక మాత్రమే దారి ఉంది. ట్రాక్టర్ వంటి వాహనాలను ఆ దారిలో వెళ్లకుండా జోగినాయునిపల్లి రైతులు కొండారెడ్డి, ఆదిశేఖరరెడ్డి, లక్ష్మీదేవి, పద్మావతి అభ్యంతరం చెబుతూ వచ్చేవారు. ఈ విషయంగా పలుమార్లు గ్రామ పెద్దలు పంచాయితీ నిర్వహించి, సమస్యకు పరిష్కారం చూపే ప్రయత్నం చేశారు. అయినా ఇరు వర్గాలు రాజీ కాలేదు. ఈ క్రమంలో కక్ష పెంచుకున్న బ్రాహ్మణపల్లికి చెందిన దాదాపు 30 మంది రైతులు శనివారం పక్కా ప్రణాళికతో రస్తా బాగు చేస్తున్నామనే నెపంతో మూడు ట్రాక్టర్లలో నాపరాళ్ల వ్యర్థాలతో చేరుకుని అక్కడే ఉన్న కొండారెడ్డి, ఆదిశేఖరరెడ్డి, లక్ష్మీదేవిపై విరుచుకుపడ్డారు. రాళ్లు, కొడవళ్లు, ఇనుపరాడ్లతో దాడికి తెగబడ్డారు. దీంతో కొండారెడ్డి, ఆదిశేఖరరెడ్డి, లక్ష్మీదేవి తలలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు తాడిపత్రిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో కొండారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు. కాగా, ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. దాడులకు పాల్పడిన ఇరువర్గాల వారు టీడీపీకి చెందిన వారే కావడంతో ఆ పార్టీ నేతలు వారి మధ్య మరోసారి సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న 'చిత్రావతి'

ధర్మవరం రూరల్: పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం తెల్లవారుజామున పైతట్టు ప్రాంతంలో కురిసిన వర్షాలకు చిత్రావతి నదిలోకి భారీగా నీరు చేరుతోంది. నది ప్రవహిస్తుండడంతో పరివాహక ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని అంటున్నారు.



నిండుగా ప్రవహిస్తున్న చిత్రావతి నది

క్లుప్తంగా

సంతల ఆదాయం రూ.2.46 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.2.46 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ కె.గోవిందు తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత ద్వారా రూ.1,35,850 వసూలు కాగా.. ఆదివారం జరిగిన ఆవులు, ఎద్దుల సంత నుంచి రూ.1,10,550 మేర వసూలైనట్లు పేర్కొన్నారు. శ్రావణమాసం ప్రభావంతో క్రయ విక్రయాలు తగ్గినట్లు తెలిపారు.

పరామర్శ



కోటంక సుబ్బన్న కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి గ్రామానికి చెందిన హరిజన కోటంక సుబ్బన్న ఆదివారం మృతి చెందాడు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. నాగార్జున రెడి, ఆదినారాయణ రెడ్డి, ఓబిరెడ్డి, విశ్వనాథ రెడ్డి (మాజీ డీలర్), వెంకట నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ నాగరాజు, వడ్డే బాల, కురవ నారాయణస్వామి (వార్డ్ మెంబర్) వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు. సుబ్బన్న కుటుంబానికి రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు.

రేపు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

రాప్తాడు: 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఈనెల 12న మండల స్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ సాకే వెంకటేష్, యూత్ మండల కన్వీనర్ బుడ్డారెడ్డి గారి విశ్వనాథ్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హంపాపురం సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గుండెపోటుతో వార్డు మెంబర్ మృతి



పెద్దన్న మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ 5వ వార్డు మెంబర్ పెద్దన్న (50) శనివారం సాయంత్రం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఆదివారం పెద్దన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వార్డు మెంబర్‌గా పెద్దన్న ప్రజలకు సేవలు అందించి గుర్తింపు పొందారని తెలిపారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, నాగరాజు, ఓబీ టైలర్ వెంకటేష్, మురళి, శ్రీరాములు, రామకృష్ణ, రామాంజి, వెంకటేష్ పాల్గొన్నారు.


శిబ్దాస్ ఘోష్‌కు నివాళి

అనంతపురం టవర్‌క్లాక్: సామ్రాజ్యవాదం ఉన్నంత వరకు యుద్ధాలు జరుగుతుంటాయని ఎస్‌యూసీఐ (సీ) పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కె.రాధకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో శిబ్దాస్ ఘోష్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సంక్షోభ పరిస్థితులను ఘోష్ ఆనాడే పసికట్టారన్నారు. నేటి తరం ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అమర్నాథ్, గోవిందరాజులు, లలిత, సుధీర్, గిరీష్, బసవరాజు, తబ్రేజ్, సుబ్రమణ్యం, నాగముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో బాధ్యతగా మెలగాలి

అనంతపురం కల్చరల్: నేటి సమాజంలో విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ నిర్మల మురళీ అన్నారు. సాయినగర్‌లోని పుట్టినిల్లు ఆశ్రమంలో ఆదివారం అమ్మాయిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు సాధరణంగా వచ్చే ఆరోగ్య సమస్యలు, ప్రశాంతంగా ఉండడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మీ, సువర్ణ, కావ్య, సుమిత్ర పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న వడ్డీ మాఫియా



➡ ఈనెల 1వ తేదీన బుక్కరాయ సముద్రం మండలం రెడ్డిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ బాలకృష్ణ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసేందుకు యత్నించాడు. ఇంటి అవసరాల నిమిత్తం అప్పు చేయగా.. వడ్డీ మీద వడ్డీ వేస్తూ నెలకు రూ.40 వడ్డీ వసూలు చేశారు. వడ్డీ కట్టలేని పరిస్థితి ఉందని చెప్పడంతో ఆటో తీసుకుని వెళ్తామని బెదిరించారు. ఆటో లేకపోతే కుటుంబం గడవడం కష్టం. బతకడం కంటే చావే నయమంటూ పోలీసు కార్యాలయంలోనే బాలకృష్ణ ఆత్మహత్యకు యత్నించాడు. అక్కడే ఉన్న పోలీసులు పట్టుకుని వారించి.. కాపాడారు.

• నగరంలో బంగారు వ్యాపారి బాబ్‌జాన్ రూ.2 లక్షలు అప్పు తీసుకుని దాదాపు రూ.10 లక్షలు వడ్డీ రూపంలో చెల్లించాడు. నెలకు సంబంధించిన వడ్డీ డబ్బు సాయంత్రం ఇస్తానని చెప్పినా వడ్డీ వ్యాపారులు ఊరుకోలేదు. ఈనెల 7న నగరంలోని పాతూరులో తిరుపాల్ ఆయన కుమారులు సూరి, శేషు ముగ్గురు కలిసి బాబ్‌జాన్‌పై కిరాతకంగా దాడి చేశారు. అక్కడే ఉన్న కొంత మంది నచ్చజెప్పినప్పటికీ, వారిపై కూడా దాడికి తెగబడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుపాల్, ఆయన కుమారులు సూరి, శేషు, మరో ముగ్గురిపై వన్‌టౌన్ సీఐ (ఇన్‌చార్జి) శ్రీకాంత్ యాదవ్ కేసు నమోదు చేశారు. కాగా.. మాలధార వీధి, భవానీ నగర్‌లో తిరుపాల్ దౌర్జన్యాలు పెచ్చుమీరుతున్నాయి. నెలకు రూ.10 వడ్డీ చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నారు.

• బుక్కరాయసముద్రం ఐలమ్మ కాలనీకి చెందిన మహబూబ్ బాషా.. రామాంజి అనే వడ్డీ వ్యాపారి వద్ద రూ.లక్ష అప్పు చేశాడు. రూ.100కు రూ.10 వడ్డీ చొప్పున మూడు నెలల వడ్డీ సక్రమంగా చెల్లించాడు. అసలు, వడ్డీ తక్షణమే చెల్లించాలని వడ్డీ వ్యాపారి ఒత్తిడి చేయడంతో మహబూబ్ బాషా మనస్తాపానికి గురయ్యాడు. ఈనెల 9న వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు.

• నగరంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అటెండర్‌గా పని చేస్తున్న రవి కుమార్ వ్యక్తిగత అవసరాల కోసం రూ.35 వేలు అప్పు చేశాడు. ఇందుకు వడ్డీ రూపంలో ఏకంగా రూ.1.50 లక్షలు చెల్లించాడు. అయినా అప్పు తీరలేదు. జీవితాంతం చెల్లించినా అప్పు తీరే మార్గం లేదని భావించిన రవికుమార్.. ఈనెల 6వ తేదీన బ్యాంక్‌లోని బాత్‌రూమ్‌లో ఉరేసుకుని మృతి చెందాడు. నెలకు రూ.50 వేల జీతం తీసుకుంటున్న ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడటంతో కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. అప్పులు చేయడంతో మానసిక ఒత్తిడికి గురయ్యాడని మృతుడి భార్య హరిత త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

- వారానికి రూ.10 చొప్పున నెలకు రూ.40 వడ్డీ
- ఒక సారి అప్పు చేస్తే జీవితాంతం చెల్లించాల్సిందే
- ఒక రోజు ఆలస్యమైనా దాడి
- పట్టించుకోని పోలీసులు

అనంతపురం: నగరంలో వడ్డీ వ్యాపారులు బరితెగిస్తున్నారు. సామాన్యుల అవసరాలను అవకాశంగా తీసుకుని రుణాలు ఇచ్చి అధిక మొత్తంలో వడ్డీ వసూలు చేస్తున్నారు. మాఫియాగా అవతారం ఎత్తి.. వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకుని వడ్డీ ఇవ్వని వారి వివరాలు అందులో నమోదు చేసుకుంటున్నారు. అప్పు తీసుకున్న వారు వడ్డీ చెల్లించకపోతే వెంటనే అందరూ అక్కడికి చేరుకుని దాడికి దిగుతున్నారు. ఇక ఉద్యోగులు ఎవరైనా అప్పు చేస్తే నెల జీతం మొత్తం డ్రా చేసుకోకుండా ఏటీఎం కార్డులు సైతం వారి వద్దే ఉంచుకుంటారు. వడ్డీ వ్యాపారస్తుల మాఫియా చేతిలో సామాన్యుల జీవితాలు ఆరిపోతున్నాయి. తలకు మించిన భారం వేసి అప్పుల ఊబి నుంచి బయటకు రానివ్వకుండా జలగల్లా పీల్చి పిప్పిచేస్తున్నారు.

మామూళ్ల మత్తులో పోలీసులు

నెలకు రూ.10 నుంచి రూ.40 వడ్డీలు వసూళ్ల భవానీ నగర్‌కు చెందిన ఓ సామాజిక వర్గం వారే వసూలు చేస్తున్నారనే సంగతి అందరికీ తెలుసు. తలకు మించిన వడ్డీ భారం కట్టాలి. కట్టకపోతే అక్రమ కేసులు పెడతారు. కేసులు పెట్టించుకుని తమ కుటుంబ పరువు ఎందుకు పోగొట్టుకోవాలని సింహభాగం లోలోన ఆవేదన చెందుతూ.. భారంగా వడ్డీలు కడుతున్నారు. ఒక్కసారి అప్పు చేసి ఊబిలోకి దిగితే.. బయటకు రావడం దాదాపు అసాధ్యం. వేలాది కుటుంబాలు ఈ అప్పుల బాధ తాళలేక చితికిపోయాయి. పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకున్న దాఖలాలు లేవు. వడ్డీ వ్యాపారం జరుగుతున్న పరిసరాలకు సంబంధించిన పోలీస్ స్టేషన్లకు మామూళ్లు పంపిస్తూ.. వీరి వ్యాపారాన్ని సజావుగా నిర్వహించుకుంటున్నారు. నెలంతా కష్టపడిని కష్టార్జితాన్ని వడ్డీ వ్యాపారి వచ్చి గద్దలాగా తన్నుకుపోతుంటే ఎవరికీ చెప్పలేని నిస్సహాయ స్థితిలో సామాన్య ప్రజలు ఉన్నారు. అసలును మించి వడ్డీ చెల్లిస్తున్నా.. ఇంకా మిగిలే ఉందంటూ దాడులకు తెగబడుతున్నారు.

టీడీపీ నేతలు అధికం..

నగరంలో వడ్డీ వ్యాపారం చేస్తున్న వారిలో టీడీపీ నేతలు అధికంగా ఉన్నారు. వీరి వద్ద అప్పు తీసుకున్న వాళ్లు భయంతో వడ్డీల మీద వడ్డీలు చెల్లిస్తూ వీధిన పడుతున్నారు. పాతూరు, రాణినగర్, వినాయక్ నగర్, బుడ్డప్ప నగర్, తదితర ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారమే వృత్తిగా ఎంతో మంది కోట్లకు పడగలెత్తడం గమనార్హం.

అటకెక్కిన చెత్త సేకరణ



నారాయణ స్కూల్ వద్ద పేరుకుపోయిన చెత్త

నగరంలో చెత్త సేకరణ కార్యక్రమం అటకెక్కింది. పాతూరు, రాణినగర్, అశోక్ నగర్, సాయి నగర్, హౌసింగ్ బోర్డు, అరవింద నగర్, 1, 2, 3, 4, 5 రోడ్లు, ఓబుళదేవ నగర్, జీసస్ నగర్, తదితర ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో చెత్త సేకరణ జరగడం లేదు. దీంతో రోడ్లన్నీ కంపు కొడుతున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారులు చేతులెత్తేశారు. ఇన్‌చార్జ్ ఎంహెచ్‌ఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక క్షేత్రస్థాయిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తించడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉదయం 5 గంటలకంతా సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించే వారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. వారు విధులకు ఎప్పుడు వస్తున్నారో వెళ్తున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. రోడ్లపై పశువులు, కుక్కలు, ఇప్పుడు పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. – అనంతపురం కార్పొరేషన్:

విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించిన నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, ఈశ్వరయ్య యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 1974 ఆగస్టు 10న యూటీఎఫ్‌ను స్థాపించారని గుర్తు చేశారు. విద్యా రంగ, ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్రంలో లక్ష సభ్యత్వం కలిగిన ఏకైక సంఘం యూటీఎఫ్ అన్నారు. జిల్లా అధ్యక్షుడు వి.గోవింద రాజులు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని చెప్పిన కూటమి.. హామీ నెరవేర్చలేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వం మోసగించిందన్నారు. తొమ్మిది రకాల పాఠశాలలను మార్పు చేసి విద్యారంగాన్ని బలహీనపర్చారని గుర్తు చేశారు. మాజీ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, పీఆర్సీ అరియర్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కె.నాగేంద్ర, గంగాధర, వెంకట నాయుడు, ఓబుళపతి, రోగప్ప, శ్రీనివాసులు, కృష్ణయ్య, ముత్యాలప్ప, రమేష్, రామ్మూర్తి, నారాయణస్వామి పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి విఫలం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోంది. కూటమి చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించేందుకు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆత్మకూరులోని కనకదాస కల్యాణ మండపంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి కాకుండా దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్షపూరిత రాజకీయాలు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ శాసన సభ్యుడు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వస్తున్నారన్నారు. కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, ఓబీ టైలర్ వెంకటేష్, రామకృష్ణ, శ్రీరాములు, మురళి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం తరాల మధ్య వారధి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఐపీఎస్ ఏకే ఖాన్, తదితరులు

అనంతపురం: మంచి పుస్తకం తరాల మధ్య వారధిగా నిలుస్తుందని విశ్రాంత ఐపీఎస్ ఏకే ఖాన్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో ముతవల్లి కేఎం షఫీవుల్లా ఆత్మకథ 'సుల్తాన్ వారసులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దశాబ్దాల అనంత చరిత్రకు దర్పణంగా నిలిచిన టిప్పు సుల్తాన్ వారసుల సమాంతర చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. కేఎం వంశస్తులైన ఇమాముద్దీన్, అమీరుద్దీన్, ఖాన్ బహుద్దూర్, కేఎం రహంతుల్లా తదితరుల చిరస్మరణీయ జ్ఞాపకాలు, విలక్షణ వ్యక్తిత్వాలను పుస్తక రూపంలో వివరించారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ముజిమిల్ ఖాన్, మేయర్ వసీం, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, ఐఎఫ్ఎస్ అధికారి హమ్నా, క్రిసెంట్ విద్యా సంస్థల చైర్మన్ షమీమ్ షఫీవుల్లా, సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ, మాజీ ఎంపీ కేఎం సైఫుల్లా, డీఆర్వో మలోలా, మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్ మహమ్మద్, సీనియర్ అడ్వొకేట్ సంపత్ కుమార్, డాక్టర్ బట్టా రామమోహన్, డిస్కవరీ అనంతపురం ఏజీ అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు

భక్తులతో పంపనూరు కిటకిట



స్వర్ణ కవచాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఆత్మకూరు: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుబ్రహ్మణ్యేశ్వరుడు, మంజునాథ స్వామికి అర్చకులు అన్నాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా స్వామి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ మేళ తాళాలతో ప్రదక్షణ చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష రాహుకేతు నివారణ హోమాలు నిర్వహించారు. శ్రావణ మాసం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. దర్శనానికి గంటల సమయం పట్టింది.

రాఘవేంద్రుడి ఆరాధన ఉత్సవాలు ప్రారంభం

అనంతపురం కల్చరల్: మంత్రాలయ రాఘవేంద్ర స్వామి ఆరాధనా ఉత్సవాల్లో ప్రధాన పర్వదినాలు ఆదివారం నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. స్థానిక మొదటి రోడ్డులోని రాఘవేంద్ర స్వామి మఠంలో ఉదయం నిర్మాల్య విసర్జనం, అష్టోత్తర పారాయణ సహిత క్షీరాభిషేకం, పంచామృతాభిషేక, అలంకార సేవలు, పాదపూజలు, కనకాభిషేకం జరిగాయి. మధ్యాహ్నం హస్తోదకం, అన్నవితరణ, సాయంత్రం రాయర సంకీర్తన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. మఠం పరిసరాల్లో రజిత రథోత్సవంలో స్వామిని పుష్పాలంకారం చేసిన భక్తి గీతాల నడుమ ఊరేగించారు. సోమవారం మంత్రాలయం తరహాలో మధ్యారాధన జరుగుతుందని మేనేజర్ తెలిపారు.

కసాపురం ఈఓగా ఎం.విజయరాజు



గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఈఓగా ఆదివారం ఎం.విజయరాజు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఈఓగా పనిచేస్తున్న కే.వాణి ఉరుకుంద ఈరన్న దేవస్థానానికి బదిలీ కావడంతో, ఆమె స్థానంలో ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం నుంచి ఆయన బదిలీపై కసాపురం వచ్చారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు.

మట్టితో సరిపెట్టారు..

సాక్షి ఎఫెక్ట్..

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం చెరువు కట్టపై ఉన్న రహదారి గుంతలతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 'కలెక్టర్ గారూ.. మీరైనా స్పందించడండి' అని సాక్షిలో వచ్చిన కథనానికి తెలుగు దేశం పార్టీ నాయకులు స్పందించారు. ఈ రహదారికి సరిహద్దుల్లో ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నా పట్టించుకోలేదని కథనంలో పేర్కొనడంతో ఎట్టకేలకు తెలుగు తమ్ముళ్లు స్పందించారు. ఆగమేఘాలతో జేసీబీ తీసుకువచ్చి గుంతలలో మట్టి వేసి చేతులు దులుపుకున్నారు. తారు వేయకుండా కేవలం మట్టి వేసి తెలుగు తమ్ముళ్లు చేతులు దులుపు కోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉంది.

నగరంలో పోలీసు వ్యవస్థ ఉందా?

- దాడులు, భూకబ్జాలు పట్టించుకోరా?
- మేయర్ వసీం ఆగ్రహం



అనంతపురం కార్పొరేషన్: 'కూటమి ప్రభుత్వంలో మాలుమూల ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం వరకు దారుణాలు పెచ్చుమీరాయి. అధికార పార్టీ అండ చూసుకుని దౌర్జన్యాలు, భూకబ్జాలు గుండాగిరి చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ, అదనపు ఎస్పీ, డీఎస్పీలు ఉండే ప్రాంతంలో ప్రశాంతత లేకుండా పోయింది. ఎస్పీ జగదీష్ ఏం చేస్తున్నారు? అసలు నగరంలో పోలీసు వ్యవస్థ ఉందా' అని మేయర్ వసీం ధ్వజమెత్తారు. ఆదివారం మేయర్ తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సాయినగర్‌లో ఓ మైనార్టీ కుటుంబానికి చెందిన రూ.కోట్లు విలువ చేసే దుకాణానికి పలువురు దౌర్జన్యంగా తాళాలు వేసి, భయానక వాతావరణం సృష్టించారన్నారు. అలాగే తపోవనంలో రూ.కోట్లు విలువ చేసే భూములకు కంచెలు వేశారన్నారు. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ దౌర్జన్యానికి పాల్పడి దోచుకుంటుంటే పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. సాయినగర్ ఘటనపై ఉదయం డీఎస్పీ శ్రీనివాసరావుకు బాధితులు ఫిర్యాదు చేస్తే.. సాయంత్రం దాడి జరిగిందన్నారు. భవిష్యత్తులో వ్యక్తులపై దాడులు, హత్యాయత్నాలు చేసిన పట్టించుకోరా? అని ప్రశ్నించారు. అనంతపురం నగరం ప్రశాంతతకు మారుపేరు.. అటువంటి నగరాన్ని కూటమి ప్రభుత్వంలో కొందరు ప్రజాప్రతినిధులు నాశనం చేస్తున్నారన్నారు. నగరంలో ఎంతో మంది మేధావులు, చదువుకున్న వారు, యువత ఉన్నారని, మీరంతా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో చోటా నాయకులు ఎంతటి దారుణాలకు ఒడిగడుతారో ఆలోచించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఇక్కడ పరిస్థితులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. లేకుంటే అధికారులపై ప్రజలకు నమ్మకం లేకుండా పోతుందన్నారు.

పార్కింగ్ అస్తవ్యస్తం



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డు ముందు ట్రాక్టర్‌ను పార్క్ చేసిన దృశ్యం

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పార్కింగ్ అస్తవ్యస్తంగా మారుతోంది. ఆస్పత్రి ఆవరణలో వాహనాలను ఎక్కడపడితే అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డు ముందు ట్రాక్టర్లు, ఇతర వాహనాలను పార్కింగ్ చేశారు. వాహనాలు ఆస్పత్రి ఆవరణలోకి రాకుండా చూసుకోవాల్సిన సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఔట్‌పోస్టు, సెక్యూరిటీ సిబ్బంది ఆస్పత్రి ప్రవేశమార్గంలో ఉన్న చెట్టు కింద నిలబడటం, గుంపులు గుంపులుగా ఉండి పిచ్చాపాటి మాట్లాడుకోవడం తప్ప వీరు చేసేదేమీ లేదని ఆస్పత్రి వర్గాలు అంటున్నాయి. – అనంతపురం మెడికల్:

ఐక్యతతో అభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

అనంతపురం కల్చరల్: స్వకుల శాలీయుల నైతిక వర్తన, క్రమశిక్షణ ఆదర్శప్రాయం. అందరూ ఐక్యతగా ఉంటే అభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక గుత్తి రోడ్డులోని అంబా భవానీ మాత ఆలయంలో స్వకుల శాలీయుల మూలపురుషుడు జిహ్వేశ్వర మహారాజ్ జయంతి ఘనంగా జరుపుకున్నారు. తొలుత తుల్జాపూర్ అంబా భవానీకి రుద్రాభిషేకం, అలంకార సేవలు నిర్వహించారు. అదేవిధంగా జిహ్వేశ్వర మహారాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వకుల శాలీ సమాజంలో ఉన్నతంగా ఎదిగి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పలువురిని ఘనంగా సత్కరించారు. అలాగే పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన చిన్నారులను గోల్డ్ మెడల్స్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా సాగిన చిన్నారుల యోగా విన్యాసాలు, సాంస్కృతిక సంబరాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సమావేశంలో ఆలయ ప్రతినిధులు నూతన కమిటీని ఎన్నుకున్నారు.

'జీవన శిల్పి'లో కవిత్వం అద్భుతం

అనంతపురం కల్చరల్: జీవన విలువలను నేర్పే కవిత్వాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన పుస్తకం 'జీవన శిల్పి' అని డాక్టర్ వైఎస్సార్ స్మారక జీవిత సాఫల్య పురస్కార గ్రహీత శాంతినారాయణ అన్నారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో సీనియర్ కవి గుడిపాటి సూర్యం రచించిన కవితా సంపుటి 'జీవన శిల్పి' పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షులు జెన్నే ఆనంద్, జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, కోటిగారి వన్నప్ప, కవి డాక్టర్ అంకె శ్రీనివాస్, మధురశ్రీ, జూటూరు షరీఫ్, రియాజుద్దీన్, టీవీరెడ్డి, చం.శాస్త్రి, చెట్ల ఈరన్న, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ రెడ్డి, కృష్ణవేణి, గుడిపాటి లీల, యలపర్తి వెంకటేశులు, శిరిమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి



దుకాణాన్ని తెరుస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం క్రైం: అస్రా ఆప్టికల్స్ నిర్వాహకులను బెదిరించి రూ.కోట్లు విలువ చేసే స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్న దుండగులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, నగర కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో సాయినగర్ ఆరవ క్రాస్‌లోని అస్రా ఆప్టికల్స్ దుకాణం ఎదుట నిరసన తెలిపారు. దుకాణానికి అధికార పార్టీ గుండాలు వేసిన తాళాలను పగులగొట్టి బాధిత మైనార్టీ దంపతులను దుకాణంలోకి పంపారు.

అనంతపురం అర్బన్: నగరంలో భూ కబ్జారాదారుల అరాచాకాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాయకుల పేర్లు చెప్పి కొందరు కబ్జాలు, దారుణాలు, అన్యాయాలకు పాల్పడుతున్నా పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు.

ఖరీఫ్ సాగుపై సమీక్షించాలి

అనంతపురం అర్బన్: వర్షాభావం కారణంగా ఖరీఫ్ పంటల సాగు పూర్తిగా పడిపోయిన నేపథ్యంలో అధికార యంత్రాంగం సమీక్షించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళిక ప్రకటించాలన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 3.42 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారన్నారు. అయితే 1.50 లక్షలు హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయన్నారు. సకాలంలో వర్షాలు కురవని కారణంగా ఈ పరిస్థితి నెలకొందన్నారు.